


సాయంత్రమవగా ఇల్లు చేరి తెచ్చినడబ్బు రెండవారి తెట్టు చూసుకొని భోషాణం అడుగున పెట్టేశాడు, గదివరకు రాలేదు తిరుపతయ్య.

ఊరంతా దీపాలు వెలుగుతున్నా, తన ఇంట్లో దీపం వెలగలేదు. కూతురు ఎక్కడుందని పెరటి వసారాలోకి వచ్చాడు. ముందు చిన్న బుడ్డి దీపం మినుకుమినుకుమంటుంటే దానినే చూస్తున్నట్లు పరధ్యానంగా చేతితో వారికేనులాంతరుతో కూర్చుని వుంది ఆదిలక్ష్మి.

"ఏమమ్మా దీపం ముట్టించలేదు?" అన్నాడు మెల్లిగా.

తండ్రి మాటవిని తేరుకొని, లాంతరు వెలిగించి తెచ్చింది ఆదిలక్ష్మి. ఆ లాంతరు వెలుగులో పీక్కుపోయివున్న కూతురుముఖం చూశాడు.

సొగసులీనిన కళ్ళు మంచముపట్టిన ముద్దయిన ఎర్రని ప్రశ్నార్థకాల్లా వున్నాయి. కడుక్కోని ముఖంమీద ఎండిన కన్నీటి చారలు ఎండకు నీటి తాకిడికి కమతి మరకలు ఏర్పడ్డ తెల్ల కాగితంపైని తారలులాగ వున్నాయి.

"ఏంతల్లీ అలాగున్నావు?" అనడిగాడు తిరుపతయ్య.

"ఏంలేదయ్యా. నువ్వు స్నానం చేసిరా— వడ్డిస్తా" అన్నది ఆదిలక్ష్మి మాటను తప్పించుకుంటూ.

ఎంత ప్రోత్సహించినా ఆమె కంఠంలో దుఃఖం వేరుకాలేదు. తిరుపతయ్య అలాగే నిలబడ్డాడు.

"నువ్వు స్నానంచేసిరా—" అని వంటింట్లోకి వెళ్ళిపోయింది ఆదిలక్ష్మి. స్నానంచేసి వచ్చాడు తిరుపతయ్య.

కంచంలో పెరుగులేదు. అన్నం చల్లారిపోయి వున్నది. కూర ప్రొద్దుటదే ఇంత వేసింది. ఒక మూల చింతకాయపచ్చడి వున్నది. తిరుపతయ్య లాంతరు వెలుగుకి చెయ్యి అడ్డంపెట్టి పదార్థాలన్నిటినీ ఒకసారి చూసుకొని అన్నం కలుపుకున్నాడు.

"మళ్ళీ ఏమి వండలేకపోయానయ్యా— అన్నీ పొద్దుటవే" అన్నది ఆదిలక్ష్మి.

తలెత్తి కూతురువంక చూశాడు. తండ్రి తన ముఖం చూడకుండా తల త్రిప్పుకొని పెరటి చీకటిలోకి చూస్తున్నది ఆదిలక్ష్మి.

తిరిగి కడుపులో పోటు వచ్చిందేమో— నొప్పి దానికి పోయినతరువాత అదే తగ్గుతుందన్నారు డాక్టర్లు. రెండేండ్లబట్టీ కాపురం చేస్తున్నా పోటు తగ్గినట్టు తగ్గి వస్తూంది. ఎంత డబ్బు పోసినా తగ్గలేదు. కపాలి ఆయుర్వేదం వాడారు. ఎంతయినా ఖని పట్టిపోయినట్టు ఇంగ్లీషుమందులు ఎందుకు పట్టిస్తుంది—అప్పటికప్పుడు ఉపశమనమన్నట్టేకాని—అనుకున్నాడు తిరుపతయ్య.

తల ఎత్తి కూతురువంక చూశాడు. కళ్ళు తుడుచుకుంటున్నది ఆదిలక్ష్మి.

"ఏం తల్లీ—కడుపులో పోటు మళ్ళీ వచ్చిందా—" అన్నాడు జాలిగా దీనంగా.

తనకేమి వచ్చినా తండ్రి సహించలేడని ఆదిలక్ష్మికి తెలుసు. తనతోపాటు బాధపడతాడు తండ్రి. తనకష్టానికి మాట ఇవ్వాలంటాడు—ఏలోపం రాకుండా చూస్తానని. అలాగే చిన్నప్పటినుండి కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చాడు. ఇప్పుడు తనకేది జరుగకూడదో అది, జరిగిందని చెబితే తండ్రి ఏమైపోతాడో కూడ తెలుసు.

మాట్లాడకుండా తండ్రివంక చూసింది. ఎత్తిన ముద్ద అలాగే చేతితో వుంచుకొని అతిదీనంగా తనవైపు చూస్తున్నాడు. తల దించుకున్నది ఏమీ అనకుండా—

తిరిగి మళ్ళీ అడిగాడు—

"నువ్వు భోజనం చెయ్యి—తరువాత మాట్లాడుకుందాము" అన్నది.



బలవంతాన్న రెండు ముద్దలు తిని—"నువ్వలా వుంటే నే నేం తినేది— ఏం జరిగిందో చెప్పు. కడుపులో పోటు ఎక్కువగా వుందా?"—అన్నాడు బాధగా.

"కడుపులో పోటులేదు ఏమీలేదు—నువ్వు తిను" అన్నది ముక్తసరిగ.

గబగబా రెండు ముద్దలు తినీ తిననట్లు తిని లేచాడు. మామూలుగా అయితే తండ్రిని కోప గించి తిన్నదానికన్న రెండు ముద్దలు ఎక్కువ తినేటట్లు చూసేది. ఇవాళ ఏమీ బలవంతం చేయ లేదు.

ఎంగిలికంచం ఎత్తి చెయ్యి కడుక్కొని మధ్య హాలులోకి వచ్చింది. కూతురుకోసం పదేపదే అటు చూస్తూ, పచార్లుచేస్తున్నాడు తిరు పతయ్య.

కూతురిని చూసి వెళ్ళి పడకకుర్చీలో కూర్చు న్నాడు. ఆదిలక్ష్మి కుర్చీ దగ్గర నేలమీద కూర్చుంది. వస్తున్న ఏడుపును చీరకొంగు నోటిలో కుక్కు కొని ఆపుకుంటున్నది. దాని ఏడుపు చూసి ఆగలేక కుర్చీలో కదలిపోతూ—"ఏం జరిగింది తల్లీ. చెప్పమ్మా!" అన్నాడు తిరుపతయ్య వణికిపోతున్న స్వరంతో.

దుఃఖాన్ని ఆపుచేసుకుంటూ, ఒక్కక్షణం తండ్రివంక చూసి తల దించుకున్నది ఆదిలక్ష్మి.

"అయ్యా—" అని మాట్లాడలేకపోయింది.

కుర్చీలో కూర్చోలేక క్రిందికి దిగిపోయి ఆది లక్ష్మికి ఎదురుగా కూర్చున్నాడు తిరుపతయ్య. ఆత్రంగా కూతురివంక చూశాడు.

"అయ్యా! మధ్యాహ్నం పేను పడుకున్నాను. కలత నిద్ర పట్టింది—" అని ఆగింది ఆదిలక్ష్మి—

"ఏం జరిగింది—త్వరగా చెప్పమ్మా. . . . ఎందు కలా నానవేస్తావు తల్లీ. చూడు నా గుండెలు కొట్టుకులాడి పోతున్నాయి"— అన్నాడు బాధగా దుఃఖపుజీరతో.

తండ్రిగుండె లెంతటి దిటువైనవో ఆది లక్ష్మికి తెలుసు. తనవిషయంలో తప్ప ప్రపంచం కదులుతున్నదన్నా నవ్వుతూ నిద్రపోగలడు. ఆ గుండె దిటవు కరగిపోతున్నది—కరగాలికూడ.

తండ్రి కళ్ళల్లోకి చూసి ధైర్యంగా దీర్ఘ ఉచ్ఛ్వాస నిశ్వాసలతో కలపి—"అయ్యా! చెప్తా విను. . . . . ." అన్నది.

"గాదిలోనుండి ధాన్యం తీయించమన్నావుకదు— రామయ్యన్నతో తీయిస్తున్నాను. పాతకాపయినా మనింట్లో పనిచేసిన వాడిలో ఎంతో తేడా మాట్లాడుతానుగా—అలానే మాట్లాడుతూ గుమ్మంలో నిలబడ్డానయ్యా. వాడు ధాన్యాన్ని అవతలికి తోడి పోస్తున్నాడు. గాదిప్రక్క ఖుప్పగా పడ్డ ధాన్యాన్ని కాలితో నెట్టుదామని దగ్గరగా వెళ్ళాను. గాలికి గది తలుపులు దగ్గరగా పడ్డాయి. వీధి తలుపు తెరచేవుంది. నే నట్టా ధాన్యాన్ని కాలితో తోస్తుంటే జిమ్మ అంచుమీద కాలుపడి తూలిగాది మీదకు పడబోయాను. రామయ్యన్న చెయ్యి పట్టు కున్నాడు పడకుండా. ఆ విసురుకు నేను వాడిమీదే పడ్డాను. నాకేమో నవ్వొచ్చింది—ఇద్దరం ధాన్యంలో అలా పడ్డందుకు. . . ." అని తండ్రివంక చూసింది ఆదిలక్ష్మి. ఊపిరి బిగపట్టి వింటు న్నాడు. తలవంచుకొని మళ్ళీ ప్రారంభించింది.

"ఇంతలో తలుపు తెరుచుకొని మీ అల్లుడొచ్చాడు. ఎప్పుడొచ్చాడో ఏమో—నేను అలానే నవ్వుతూ గుమ్మందగ్గరకు వెళ్ళాను. కళ్ళు చింతనిప్పుల్లా చేసుకు చూచి ఒక్కటి కొట్టాడాయన" అన్నది ఆదిలక్ష్మి కొద్దిగా ఏడుపులో చెంపపై చేయి వేసుకొని. తిరుపతయ్య పిచ్చివాడిలా చూస్తు న్నాడు కూతురి వంక.

"నే నదరిపడ్డాను. ఏమిటని అడగబోయాను—

(48-వ పేజీ చూడండి)

# కలత నిదుర

(17 వ పేజీ తరువాయి)

మళ్ళీ ఒక్కటే కొట్టాడాయన. ఇంతలో రామయ్యన్న విసురుగా వచ్చి; ఆయనను దూరంగా తోసేశాడు. మీ అల్లుడిసంగతి తెలుసుగా — ఎవ్వరి పైకీ వెళ్ళరు. దూరంగా నిలబడి పొగలు క్రక్కుతూ చూస్తున్నాడు. నేనేం చేశాను ఇలా కొట్టారని అడిగాను ఏడుస్తూ—అంతే. పోటి కొచ్చి నట్లల్లా అని ఇంక ముఖం చూడనంటూ పోయారయ్యా!'' అని ఏడవసాగింది.

''ఎంతవని జరిగింది—'' అన్నాడు తిరుపతయ్య వణుకుతున్న కంఠంతో.

''అసలు విషయం చెప్పనీయయ్యా'' అని ఆగింది

''ఇంకేం చెబుతావు—అల్లుడు కొంపముంచాడు. ఆ రామిగాడి కేం వచ్చిందే మధ్యన వచ్చాడు. . . .'' అన్నాడు అలా వణికిపోతూ. అతని కళ్ళ వెంబడి నీళ్ళు కారుతున్నాయి.

''నన్ను చెప్పనీ అయ్యా—నేను కాళ్ళమీద పడదామన్నా అందక వీధిన పోతున్నా డాయన. నేను గట్టిగా ఏడుస్తూ కేకలేస్తూ వీథిన వెళ్ళాను'' అని ఆగి—''ఇంతలో నిద్ర మెలుకవ వచ్చిందయ్యా'' అన్నది ఊపిరి బిగపట్టి.

క్రుంగిపోతున్న తిరుపతయ్య ఉలిక్కిపడ్డాడు.

''ఏమన్నావు తల్లీ—ఏమన్నావు?'' అన్నాడు ఆ దుఃఖంలో ఆత్రంగా.

''అవునయ్యా—ఏమీలేదు'' అన్నది తండ్రి వంక చూస్తూ—

ఏమీ మాట్లాడక కూతురివంక చూస్తూ వున్నాడు తిరుపతయ్య. తండ్రిని చూసి మెల్లగా ''అయ్యా! ఇది నిజంగా నాకు జరిగితే నేనే మవుతానే'' అన్నది ఆదిలక్ష్మి.

''ఛీ! ఏమిటా అశుభపు మాటలు'' అన్నాడు బాధగా విసుక్కొని.

''నువ్వు బాధపడ్డావుకదూ!''

''బాధపడటం— ! ఎంత కొట్టుకులాడిపోయింది గుండె. ఎంత భయపడిపోయాను. నాకు మతిపోతున్న ట్లనిపిస్తే—'' అన్నాడు తేరుకుంటూ.

''అయ్యా!—ఇది ఇలా నాకు జరుగుతే నువ్వేమయ్యేవో అలానే ఒక కూతురికి—నీలానే ఒక్కగా నొక్కకూతురు కలవాడికి—జరిగితే దాని తండ్రి నీలానే అవ్వడూ'' అన్నది బొంగురుపోయిన కంఠంతో.

''ఎందుకు కాదే—'' అన్నాడు తిరుపతయ్య.

ఆదిలక్ష్మి తండ్రివైపు సూటిగా చూస్తూ— ''నాకు ఇది జరగలేదు. కాని వింటుంటేనే నీ గుండె లవసిపోతున్నట్లనిపించింది. నిజంగా ఇది ఒకరికి జరిగి దాని తండ్రిగుండెలు పగులుతున్నాయే అయ్యా!'' అన్నది కొద్ది గట్టిగా ఏడుస్తూ.

కూతురువంక అయోమయంగా చూస్తున్నాడు తిరుపతయ్య.

''నువ్వు పగతో పుట్టావు. నీకు ఎదురు చెప్పినవాళ్ళు నాశనమవ్వాల్సిందే తప్ప నువ్వు వాళ్ళను వదలవు. వాళ్ళేకాదు. వాళ్ళ సంతానం యావత్తూ నాశనమవ్వాల్సిందే. ఇది నీ పగ—'' అన్నది ఆదిలక్ష్మి తండ్రిని చూస్తూ.

తిరుపతయ్య మాట్లాడలేదు. కూతురు మొహమాటంలేకుండా చెబుతుంది ముఖంమీద. ఎందుకింత నిష్ఠూరంగా మాట్లాడుతుందో అర్థం కాలేదు.

''నీకు కావల్సినంత డబ్బు వుంది. ఇంకా సంపాదిస్తున్నావు—వేలకువేలు. ఆ సంపాదనంతా ఎందుకు—నా కివ్వటానికా! నాకుగాక ఎవరి కిస్తావు? ఉన్న కొడుకు నొక్కడిని మనసు విరిచి పట్నం తగిలేసావు. అప్పన్న అన్నయ్య నీ సొమ్ములో కాణీ ముట్టుకుంటాడంటే నాకు నమ్మకంలేదు''

> నేను క్లాసులో నుండి బయటికి వెళ్ళి నాలుగు స్వీట్స్ కొనుక్కొని వచ్చి క్లాసులో కూర్చున్నాను. మా మాస్టారు నేను బయటకు వెళ్ళిన తర్వాత పుస్తకము తీసి 'ప్రాడిగల్‌సన్' అనే పాఠాన్ని చెబుతున్నాడు. నేను త్వరగా వచ్చి సీట్‌లో కూర్చున్నాను. మాస్టారు నాకేసి చూచి "ప్లీస్, గివ్‌మి, మై, షేర్" అన్నాడు. నేను తత్తరపాటులో రెండు 'స్వీట్'లు తీసి మేస్టారి ముందుంచాను. క్లాసంతా గొల్లుమన్నారు. ఏం చెయ్యాలో నాకు తోచలేదు.
>
> గనిపిశెని శంకరయ్య (చిట్రగుంట)

అని ఒక్కక్షణం ఆగి మెల్లగా ''వాడెందుకు పోయాడయ్యా ఇల్లు విడచి?'' అనడిగింది.

''అమ్మా!'' అన్నాడు తిరుపతయ్య అతి కష్టంమీద.

''జ్ఞాపకంలేదా అయ్యా! నువ్వు నాంచారుపెళ్ళి చెడగొట్టావు. ఊరులో పెళ్ళివాళ్ళు దిగారు. ప్రొద్దుట పెండ్లయితే ఆరాత్రి నాంచారు గుణం చెడ్డదన్నావు. నీ కొడుకుతో సంబంధం వున్నట్లు నీ పాలికాపు కుర్రాళ్లతో వాగించావు. ఇదంతా అప్పన అన్నయ్య ఊర్లో లేకపోవటంతో జరిగింది. గ్రుడ్డి ముండాపోళ్ళు—పెళ్ళివాళ్ళు చీకొట్టిపోయారు. ఆ దెబ్బతో సింహాచలం మామయ్య పాతాళానికిపోయాడని సంతోషించావు. నీ కొడుకు మనసు విరిగి నీతో బతకలేక పట్నంలో దూకాణాల్లో గుమస్తాగిరిలో బ్రతుకుతున్నాడు. వాడు పోయాడని నీకు ఇంతయినా చింతలేదు. నీకు డబ్బు కావాలి. సంపాదిస్తున్నావు. ఎవరికి—నాకా! ఛీ—నేను పుచ్చుకుంటానా? మాకు కావల్సినంత వుంది. నీతోనే నీ డబ్బునూ తగలేస్తాను. ఈ ఇంటి నుండి చీపురుపుల్ల పట్టుకెళ్ళను—'' అన్నది ఉద్వేగంగా కోపంగా దుఃఖంతో—

తిరుపతయ్య ఏమీ మాట్లాడక మూగవోయి పిచ్చివాడిలా కూతురివంక చూస్తున్నాడు.

''అయ్యా! నీ పగ సాధించుకున్నావు. రెండు సంవత్సరాలబట్టీ తీసుకుంటున్న సింహాచలం మామయ్య పక్షవాతం ఎక్కువయి గంటలమీద వున్నాడు. పొలం బాగుచేసుకోవటానికి నీలాగే అతడూ అప్పుకు పెడితే నీకు రాకుండా ఆయనకు వచ్చిందనేగా పగపెట్టుకున్నావు! కూతురు పెండ్లిమీద దెబ్బకొట్టావు. ఇదిగో దాని ఆఖరిఘట్టం— సింహాచలం మామయ్య చచ్చిపోతున్నాడు. నాంచారమ్మ వీధులవెంటపడి దిక్కులేనిదౌతుంది. దాని ఉసురు నీకు తగుల్తుంది—నేనిక ఈ ఇంట ఉండను. రేపే మా అత్తగారింటికి పోతున్నాను. మీ అల్లుడు ప్రతిరోజూ నా కోసం రావడం నాకే సిగ్గుగావుంది. ఈ ఇల్లూ ఆ డబ్బూ పెట్టుకో—ఇంకా ఎవరైనా ఉన్నారేమో చూడు. వాళ్ళవెంటపడు. వాళ్లను వాళ్ల వంశాంకురాలతో సహా మాడ్చివేయి—'' ఆదిలక్ష్మి ఇంక మాట్లాడలేకపోయింది. లేచి నిలబడి— ''సింహాచలం మామయ్యను మిషినాసుపత్రిలో వేశారంట. ఉన్న పదెకరాలు అమ్ముకొని రోగం నయమవుతుందేమోనని చూశాడు ఈ రెండు సంవత్సరాలు. పెళ్ళికానిపిల్లకు కాణీ లేకుండా చేసిపోతున్నాడు'' అన్నది.

తిరుపతయ్య నిరుత్తరుడై అలానే కూర్చొని వున్నాడు. రాయిలా మాట్లాడక కూర్చున్నాతడు వింటున్నా, వినకపోయినా తనే చెప్పుకుపోయింది. హాలు విడచి వెళ్తూ వెళ్తూ వెనుతిరిగి—''అయ్యా! మధ్యాహ్నం కబురందింది. సింహాచలం మామయ్య చచ్చిపోతే నాంచారమ్మ గతేమిటని ఆలోచించావు. నేనే నాంచారమ్మనయితే ఎలాగౌతా ననుకున్నావయ్యా!'' అన్నది బాధగా దుఃఖంతో రుద్ధమైన కంఠంతో—

తిరుపతయ్య చటుక్కున కూతురివంక చూశాడు. అతడిలో ఎటువంటికళా లేదు. పాలిపోయి క్రుంగి పోతున్నట్లున్నాడు.

ఆదిలక్ష్మి పెరటిలోకి వెళ్ళిపోయింది. లేచి నిలబడ్డాడు తిరుపతయ్య. కాళ్ళల్లో సత్తువ లేనట్లనిపించింది. తప్పటడుగులు వేసుకుంటూ భోషాణంగదిలోకి వెళ్ళాడు. దానిని చూడగానే వరనరాలలో ఏదో శక్తి విజృంభించింది. గబగబా దానిమీద సామానునంతా దింపి భోషాణం తెరచి ప్రొద్దుట తెచ్చిన రెండువేలూ తీసి రొండిన కట్టుకున్నాడు. తిరిగి భోషాణం మూసి కర్ర తీసుకొని హాలులోకి వచ్చాడు. ఆదిలక్ష్మి వచ్చింది. ఆవిడ ముఖంలోకి చూడలేకపోయాడు.

''చూడు తల్లీ! తలుపు వేసుకో—అప్పన్నబాబు నాంచారమ్మతో వచ్చి తలుపు తియ్యమన్నప్పుడు నాకూ తలుపు తియ్యి'' అన్నాడు వీధిగుమ్మం దాటుతూ.

★